# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 16-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో సాంస్కృతిక మహోత్సవం 'సంస్కృతి కా మహాకుంభ్' ఈరోజు ప్రారంభమవుతుంది.**

**2.** **ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఈరోజు తనిఖీ చేశారు.**

**3.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈనెల 19వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

4\. **రచయిత, సంఘసంస్కర్త,స్వాతంత్ర్య సమరయోధులు త్రిపురనేని రామస్వామి వర్ధంతి ఈరోజు.**

**5.** **ఖో ఖో ప్రపంచ కప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కి చేరాయి.**

==========================

ఉత్తర్ ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో సాంస్కృతిక మహోత్సవం 'సంస్కృతి కా మహాకుంభ్' ఈరోజు ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో దేశంలో ప్రఖ్యాత కళాకారులు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలువనున్నాయి. గంగా వేదికపై శంకర్ మహదేవన్ సహా ప్రసిద్ధ కళాకారుల ప్రదర్శనలు ఇవ్వనున్నారు. 10 వేల మంది ప్రేక్షకుల సామర్థ్యం కలిగిన ఈ వేదిక ప్రధాన ఆకర్షణగా నిలువనుంది.

--------------------------

ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులను ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 118వ సంచిక ఈనెల 19వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

--------------------------

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ –ఇస్రో ఇటీవల ప్రయోగించిన స్పేడెక్స్ ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసినట్లు ఇస్రో ఈరోజు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. దీనిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు, సాంకేతిక బృందానికి అభినందనలు తెలిపారు

---------------------------

బేటీ బచావో, బేటీ పఢావో ఆడపిల్లను రక్షించండి, ఆడపిల్లలకు చదువు చెప్పండి అనే నినాదంతో దేశంలోని బాలికల సంక్షేమం కోసం, వారి చదువుల కోసం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకం తిరుపతి జిల్లాలో సత్ఫలితాన్నిస్తోంది. ఆడపిల్లలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం కింద తపాలాశాఖ, అన్ని జాతీయ బ్యాంకుల్లోను తల్లిదండ్రులు తమ పిల్లల పేర్ల మీద బ్యాంకు ఖాతాలను తెరవచ్చు. ఈ పథకం తమకు ఎంతగానో ఉపయోగపడుతోందని తిరుపతి జిల్లా స్థానీకురాలు సజీన ప్రభుత్వానికి ఆకాశవాణి ద్వారా కృతజ్ఞతలు తెలియజేస్తూ...

..వాయిస్..20 సెకన్లు

---------------------------

కృష్ణాజిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో నూతనంగా నిర్మించిన జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం 10వ బెటాలియన్ ప్రాంగణాలను కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా ఈనెల 19న ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ సహా ఇతర మంత్రులు హాజరుకానున్న నేపథ్యంలో అధికారులు పటిష్ట భద్రతా ఏర్పాట్లను చేస్తున్నారు.

---------------------------

ప్రముఖ రచయిత, సంఘసంస్కర్త,స్వాతంత్ర్య సమరయోధులు త్రిపురనేని రామస్వామి వర్ధంతి ఈరోజు. ఆయన 1887 జనవరి 15వ తేదీన కృష్ణా జిల్లా, అంగలూరు గ్రామంలో జన్మించారు. 1914లో న్యాయ శాస్త్రం చదివేందుకు విదేశాలకు వెళ్లిన ఆయన అనీ బీసెంట్ ప్రారంభించిన హోం రూల్ ఉద్యమానికి మద్దతు పలికి, స్వాంతంత్ర్యోద్యమ సమయంలో ప్రజలకు స్ఫూర్తినిచ్చి ఉత్తేజపరిచే అనేక దేశభక్తి గీతాలు రచించారు. సంస్కృత భాషలో ఉన్న పెళ్ళి మంత్రాలను తెలుగులోకి అనువదించి, అచ్చ తెలుగులో సరళమైన వివాహ విధి పద్ధతిని తయారు చేసిన రామస్వామి సూతపురాణము శంబుకవధ వంటి ప్రసిద్ధ రచనలు చేశారు. అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన త్రిపురనేని రామస్వామి 1943 జనవరి 16వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వడిగ్రీ కళాశాలలో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం ఇండోర్ స్టేడియం భవనాన్ని శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు. అనంతరం పాత్రికేయులతో రవి నాయుడు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు జాతీయ స్థాయిలో రాణించాలని.. దేశానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రధానమైన ప్రాంతాల్లో

నూతన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలుపుతూ..

..వాయిస్..35 సెకన్లు

---------------------------

రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గ శాసన సభ్యులు బండారు శ్రావణీశ్రీ అన్నారు. మండల పరిధిలోని రేకలకుంట గ్రామంలో పల్లె పండగ కింద నిర్మించిన కచ్చా రోడ్డును ఆమె నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఆరు కోట్ల రూపాయల వ్యయంతో మౌలిక సదుపాయల కల్పనకు తాము కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే వేసవిలో నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ముందుస్తు ప్రణాళిక రుపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

---------------------------

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2024 సంవత్సరం డిసెంబరు 7 నుంచి 2025 సంవత్సరం మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 347 జిల్లాల్లో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ వంద రోజుల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించడం, సత్వర వైద్య సేవలను అందించడం, నిక్షయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల కింద పౌష్టికాహారం అందించడం వంటివి నిర్వహిస్తారు.

ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం మార్చి 24వ తేదీకి వారం రోజుల ముందు ఈ ప్రచార కార్యక్రమం పూర్తికానుంది. ఇందులో ఉత్తమ ఫలితాలు కనబరిచిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించనుంది.

---------------------------

ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఖో ఖో ప్రపంచ కప్‌లో భారత పురుషుల జట్టు వరుసగా 3 మ్యాచుల్లో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ చేరింది. నిన్న పెరూతో జరిగిన మ్యాచులో 70-38 తేడాతో విజయం సాధించింది. మరోవైపు మహిళల జట్టు ఇరాన్‌పై 100-16 తేడాతో గెలుపొంది క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఈరోజు పురుషుల జట్టు భూటాన్‌తో, మహిళల జట్టు మలేషియాతో పోటీ పడనున్నాయి.

=====================